# ఎన్నికలంటే తెరాసకు పండగ

## వైఎస్ అహంభావి ★ ఆయన పాలనలో అడ్డగోలు అవినీతి ★ చంద్రబాబు ధ్వజం

తెరాస నాయకులకు ఎన్నికలంటే పండగ.. వారికి అదో సరదాలా మారిందని తెదేపా అధినేత చంద్రబాబు మండిపడ్డారు. ఏడాదిలోపే సాధారణ ఎన్నికలు వచ్చేవని, అప్పుడు తెలంగాణ అంశంపై తేల్చుకునే అవకాశం ఉండగా.. ఇప్పుడు అనవసరంగా రాజీనామాలు చేశారని విమర్శించారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా దొమ్మాట, సిద్దిపేట నియోజకవర్గాల్లో గురువారం ఆయన రోడ్‌షోలు నిర్వహించారు. ఆయన వెంట దొమ్మాట, సిద్దిపేట తెదేపా అభ్యర్థులు చెరుకు ముత్యంరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు నిజామాబాద్‌జిల్లా ఎల్లారెడ్డిలోనూ బాబు విలేఖరులతో మాట్లాడారు. ఆయా సందర్భాల్లో ఆయనేమన్నారో ఆయన మాటల్లోనే..

తెరాసతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు.. భవిష్యత్తులో కూడా వారు చేసేదేమీ లేదు. గత ఎన్నికల ముందు ఇంటికో ఉద్యోగం, ప్రతి పేద కుటుంబానికీ మూడెకరాల చొప్పున పొలమిస్తామని తెరాస ఊదరగొట్టింది. కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రి పదవులు వెలగబెట్టిన ఆ పార్టీ పెద్దమనుషులు ఆ హామీలు ఎందుకు నెరవేర్చలేదు? తెలంగాణ అదిగో.. ఇదిగో అంటూ మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. తెరాస ఎన్నడూ రైతులు, బీడీ కార్మికులు, గల్ఫ్ బాధితుల గురించి పోరాడలేదు... బాబ్లీ ప్రాజెక్టు వంటి సమస్యలపై కూడా వారు నోరు మెదపలేదు. తెరాస ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్నామంటోంది. ఏనాడూ ఉద్యమాలు చేయలేదు. ఆ పార్టీ నేతలు పదవులు అనుభవించారు. కేసీఆర్, వైఎస్ దొంగాట ఆడారు. తెలంగాణ అంశానికి సంబంధించి తెదేపాలో చర్చ జరుగుతోంది. ఐదుగురు సభ్యుల కమిటీ దీనిపై అధ్యయనం చేస్తోంది.

### మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. అవినీతికి అడ్డే లేకుండాపోయింది. మద్యం కంపెనీలు ఇచ్చే 5 శాతం కమీషన్లకు కక్కుర్తిపడి సీఎం రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు. ఆయనకు ప్రజలంటే లెక్కలేదు. గర్వం, అహంభావం పెరిగాయి. ఏదైనా చేయవచ్చన్న ధీమాతో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పునరంకిత సభలో రాబోయే ఎన్నికల్లో గెలుపు మాదే అని ఆయన ప్రకటించుకున్నారు.. అంటే ఉప ఎన్నికల్లో ఓడిపోతారనేగా అర్థం. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రైతు సమస్యలు పాలకులకు పట్టడం లేదు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు నల్లబజారులో అత్యధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి. 2.5 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తానని చెప్పిన వైఎస్.. అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరిచారు. మైనారిటీల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది. నా హయాంలో హైదరాబాద్‌లో హజ్‌హౌస్ కట్టించి ముస్లింలు నేరుగా మక్కా వెళ్లడానికి విమాన సౌకర్యం కల్పిస్తే.. ఈ ప్రభుత్వం హజ్ హౌస్‌ను ఐదు నక్షత్రాల హోటల్‌గా మార్చాలని చూస్తోంది. మైనారిటీలకు 3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎలాంటి చిక్కులుండవని మేం చెప్పాం. దానిని పట్టించుకోకుండా ఐదు శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి తీరా అమలు చేయని పరిస్థితి కల్పించింది. మేం అధికారంలోకి వస్తే మైనారిటీలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయిస్తాం. నిరుద్యోగులకు రూ.1000 భృతి, వృద్ధులు, వికలాంగులకు రూ.500 చొప్పున పింఛన్లు ఇస్తాం. రైతులకు పగటిపూట 12 గంటలు ఉచిత, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం. ఇళ్లకు 50 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తాం. డ్వాక్రా మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేసి గ్యాస్ ధర తగ్గిస్తాం. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 205 వాగ్దానాల్లో 105 నెరవేర్చామని కాంగ్రెస్ ప్రకటించింది. ముఖ్యమైన వాగ్దానాల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. అసలు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలు, అమలును బయటపెట్టాలి. ఎన్ని హామీలు ఇచ్చి పూర్తిచేశారో వాస్తవాలు ప్రకటించాలి. తెదేపా నాయకులను కాంగ్రెస్ డబ్బు పెట్టి కొనుగోలుచేస్తోంది. మా పార్టీకి చెందిన మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు ప్రలోభాల వల్లే కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అయినా మాకు నష్టం లేదు. ఉప ఎన్నికలపై ప్రభావం ఉండదు.

**- న్యూస్‌టుడే, సిద్దిపేట రూరల్, సిద్దిపేట టౌన్, నంగునూరు, కొండపాక, దుబ్బాక, ఎల్లారెడ్డి**



మెదక్ జిల్లా ఘాంపల్లిలో బాబు రోడ్డుషో